క్లుప్తంగా

రేపటి నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో బుధ, గురువారాల్లో మండల స్థాయి సీఎం కప్–24 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీతోపాటు గ్రామపంచాయతీల నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేవారు మంగళవారం సాయంత్రం 3 గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లతోపాటు బాదేపల్లి ఫిజికల్ డైరెక్టర్ కళ్యాణ్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల ప్రారంభానికి డీఈఓ ప్రవీణ్‌కుమార్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ హాజరు అవుతారని తెలిపారు.

గండేడ్: మండలంలో సీఎం కప్ క్రీడాపోటీలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దేవన్న తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగుతాయన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ పోటీలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఏబీవీపీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ డిసెంబర్ 23, 24, 25వ తేదీల్లో సిద్దిపేటలో జరగనున్న 43వ మహాసభలను విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి 1500మంది విద్యార్థులు పాల్గొంటారని, విద్యారంగం స్థితిగతులపై చర్చ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణు, నరేష్, కృష్ణ, శిరీష, శివ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె వాహనాల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో నడుస్తున్న అద్దె వాహనాలకు చెల్లించాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం సమర్పించారు. సంవత్సరం నుంచి బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలవుతున్నామని అన్నారు. దీంతో తమ కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

మట్టి పనులు పూర్తిచేయాలి

నవాబుపేట: గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో మట్టి పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం ఆయన పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతూ నర్సరీల్లో బ్యాగ్ ఫిలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసే పనులు చేపట్టాలని ఆయన వివరించారు. గ్రామాల టార్గెట్ ప్రకారం బ్యాగ్ ఫిల్లింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా గ్రామాలకు ఇప్పటికే పాలిథిన్ కవర్లు ఇచ్చారన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు మండల అధికారులకు సమాచారమివ్వాలని ఆయన సూచించారు.

నేడు పండుగ సాయన్న వర్ధంతి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రాబిన్ హుడ్, బహుజన బంధువు పండుగ సాయన్న 89వ వర్ధంతిని మంగళవారం నిర్వహిస్తున్నట్లు పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక తెలంగాణచౌరస్తాలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించనున్నామన్నారు. వర్ధంతి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పండుగ సాయన్న అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాస్వామిక, బహుజన వాదులు హాజరు కావాలని ఆయన కోరారు.

బైక్ ఢీకొని వ్యక్తి తీవ్రగాయాలు

మహమ్మదాబాద్: రోడ్డు దాటుతున్న వ్యక్తికి బైకు ఢీకొని వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. గండేడ్ మండలంలోని రంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంకం కేశవులు చిన్న వాగుపై బ్రిడ్జి దాటుతున్నాడు. మహబూబ్‌నగర్ నుంచి కోస్గివైపు బైకుపై వెళ్తున్న వ్యక్తి అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో కేశవులు రోడ్డుపై పడిపోగా తల, ఎడమభుజం, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

లీకేజీలు సరిచేయరా?

- ప్రధాన రోడ్లపై వృథాగా పారుతున్న తాగునీరు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


జీజీహెచ్‌కు ఎదురుగా మెయిన్ రోడ్డుపై లీకేజీ అయి వృథాగా పారుతున్న తాగునీరు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో పలుచోట్ల మిషన్ భగీరథ పథకం పైపులైన్లు పగిలి నెలలైనా మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తాగునీటిని వదిలినప్పుడు రోడ్లపై ఏరులై పారుతూ వృథా అవుతోంది. మూడు నెలల క్రితం ఓ ప్రైవేట్ టెలికాం సంస్థ నిర్వాహకులు నవాబుపేట రోడ్డు వెంట కేబుల్ వేయడానికి గుంతలు తవ్వారు. ఈ క్రమంలోనే కలెక్టర్‌బంగ్లా చౌరస్తా సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న మిషన్ భగీరథ పథకం పైపులైన్ పగిలింది. దీనిని వారే సరిచేయాల్సి ఉన్నా పట్టించు కోలేదు. అలాగే గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)కు ఎదురుగా ఉన్న మెడికల్ షాపుల వద్ద మెయిన్ రోడ్డుపై పక్కపక్కనే రెండు చోట్ల పైపులైన్ పగిలింది. ఇదే మార్గంలోపి గేట్‌వాల్వ్ వద్ద లీకేజీ అయి నెల రోజులకు పైగా తాగునీరు రోడ్డుపై వృథాగా పారుతోంది. ఇక తెలంగాణచౌరస్తా వద్ద, అక్కడి నుంచి ఎర్రసత్యంచౌరస్తా మధ్యన ఒకచోట, క్రిస్టియన్ కాలనీలోకి వెళ్లే దారి ఓ పాలబూత్ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. అలాగే వీరన్నపేట–పెద్ద శివాలయం మార్గంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద కాజ్‌వేలో నుంచి వెళ్తున్న పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి ఎన్నో నెలలవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంఈ యు.బస్వరాజ్‌ను వివరణ కోరగా త్వరలోనే వీటిని బాగు చేసి తాగునీరు వృథా కాకుండా చూస్తామన్నారు.


కలెక్టర్‌బంగ్లా చౌరస్తా సమీపంలో వృథాగా పోతున్న తాగునీరు


కలెక్టర్‌బంగ్లా చౌరస్తా సమీపంలో పైపులైన్ పగిలింది ఇక్కడే..

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు


నవాబుపేట పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ సర్పంచ్‌లు

- ముందస్తుగా అరెస్ట్ చేయడం తగదు
- సర్పంచ్ సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్

జడ్చర్ల: తాము గ్రామ సర్పంచ్‌లుగా ఉన్న కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ డిమాండ్ చేశారు. సోమవారం చేపట్టిన 'చలో అసెంబ్లీ' సందర్భంగా పలు గ్రామాల సర్పంచ్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రణీల్‌చందర్ మాట్లాడారు. అసెంబ్లీలో ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలు ఇచ్చేందుకు వెళ్లనీయకుండా ముందస్తుగా అరెస్ట్ చేయడం తగదన్నారు. సర్పంచ్‌ల సంఘం మాజీ నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, ప్రభాకర్‌రెడ్డి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలం నుంచి 'చలో అసెంబ్లీ'కి నుంచి బయలుదేరుతున్న మాజీ సర్పంచ్‌లను ఎస్‌ఐ విక్రమ్ అరెస్టు చేశారు. వారిలో మాజీ సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, అబ్దుల్లా, యాదయ్య, వెంకటేష్, చెన్నయ్య, హన్మంతు, నర్సింహులు, వెంకటయ్య తదితరులున్నారు.

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లోని మాజీ సర్పంచులను సోమవారం భూత్పూర్ పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ ఎదుట వారు కొద్ది సేపు నిరసన తెలిపారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. రైతు సంఘం మాజీ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, మాజీ సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, బోల శేఖర్, యాదయ్య ఉన్నారు.

సమ్మెకు వెళ్లకముందే ప్రభుత్వం స్పందించాలి

పీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్


సంఘీభావం ప్రకటించిన పీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్

జడ్చర్ల టౌన్: సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరవధిక సమ్మెకు వెళ్లకముందే ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చాలని పీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్ డిమాండ్ చేశారు. మూడు రోజులుగా ఎమ్మార్సీల్లో శాంతియుతంగా దీక్ష చేపడుతున్న ఉద్యోగులకు మద్దతుగా సోమవారం జడ్చర్ల ఎమ్మార్సీ వద్ద సంఘం తరపున సంఘీభావం ప్రకటించి ప్రసంగించారు. మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు సమగ్ర శిక్షా ఉద్యోగులు సిద్ధం అవుతున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అసోసియేషన్ నాయకులు ఆనంద్‌కుమార్, మొయినొద్దీన్, అశోక్, శాంతి, సర్వ శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, రామస్వామి, నిర్మల, వసంత, పద్మ పాల్గొన్నారు.

ఆర్ఎంను కలిసిన మాజీ ఉద్యోగులు


ఆర్ఎంను సన్మానిస్తున్న రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షుడు ఎ.రాజసింహుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో నూతనంగా వచ్చిన ఆర్ఎం సంతోష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రాజసింహుడు మాట్లాడుతూ ఆర్టీసీ క్లినిక్‌లో మందులు సరఫరా కావడం లేదని, డాక్టర్, ఫార్మాసిస్ట్ లేరని తెలిపారు. కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరారు. నాయకులు ఉమేష్ కుమార్, జేఎస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భాస్కర్, నర్సింలు, ఎస్ఆర్.గౌడ్, బుచ్చన్న, డేవిడ్, కృష్ణ, రియాజుద్దీన్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి

మిడ్జిల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మనలో ఉన్న ప్రతిభ క్రీడల ద్వారా బయటకు వస్తుందని అన్నారు. పోటీల్లో ప్రతిఒక్కరూ పాల్గొని ప్రతిభ కనబర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ జగదీశ్వర్, ఎంఈఓ సుధాకర్, ఇన్‌చార్జీ హెచ్ఎం మోహన్‌రెడ్డి, నాయకులు గౌస్, సాయిలు, నర్సింహ్మా, మల్లికార్జున్‌రెడ్డి, జహంగీర్, ఉస్మాన్, పర్వతాలు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి


నంచర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రాజునాయక్

మహమ్మదాబాద్: పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచి అత్యధిక మార్కులు విద్యార్థులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రాజునాయక్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని నంచర్ల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయా తరగతుల విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెల్సుకున్నారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆశా కార్మికుల జీతాలు పెంచాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి


డీఎంహెచ్ఓ కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్మికులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఆశా కార్మికుల జీతాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టర్, డీఎంహెచ్ఓలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 10న ఆశా కార్మికుల చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి సాధన, యాదమ్మ, పద్మ, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి పెద్దపీట

మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్


సీసీరోడ్డు పనుల ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక మూడో వార్డు పరిధిలోని పవనపుత్ర కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో స్థానిక సమస్యలపై అప్పటి పాలకులు దృష్టి పెట్టలేదని ఆరోపించారు. తమది ప్రజా ప్రభుత్వమని, పార్టీలకతీతంగా పనులు చేపడుతున్నామన్నారు. ఎంఈ యు.బస్వరాజ్, కౌన్సిలర్ రామాంజనేయులు, స్థానిక నాయకులు ప్రశాంత్, మోహన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

వేడుకలు వైభవంగా నిర్వహించాలి

క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎంబీసీ కాంపౌండ్‌లో నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు సంబంధించి సభా ప్రాంగణం, సన్నాహక ఏర్పాట్లను సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈనెల 15న ముందస్తు వేడుకలు ఘనంగా చేపట్టాలన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, పాస్టర్ వరప్రసాద్, డేవిడ్, శ్యాముల్, రాజు తదితరులు పాల్గొన్నారు. మూడోవార్డు పరిధిలోని చైతన్యస్కూల్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు.కౌన్సిలర్ రామాంజనేయులు, స్థానిక నాయకులు పెద్దగొల్ల నర్సింహులు, సిద్ధూ, అంజన్‌గౌడ్, శ్రీనివాసులు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించాలని వినతి



దేవరకద్ర: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మండల పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

గ్రూప్–4 విజేతకు సన్మానం

దేవరకద్ర: మండలం కోయిల్‌సాగర్‌కి చెందిన చెన్నయ్య అనే యువకుడు గ్రూపు 4 పరీక్షలో ఉత్తీర్ణుడయి ఉద్యోగానికి అర్హత సాధించినందుకు సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందుగౌడ్, పాశం రఘు, మోహన్‌యాదవ్, ఖాజా, వెంకటయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

జడ్చర్ల టౌన్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించినట్లుగా బీసీల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని బీసీ జాగృతి సేన మండల అధ్యక్షుడు నిరంజన్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటుచేసి చట్టబద్ధత కల్పించాలని కోరారు. బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్ల ద్వారా బీసీ సామాజికవర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు 100శాతం రాయితీతో రుణాలు అందించాలన్నారు. గురుకుల పాఠశాలల్లో అధికారులు తనిఖీలు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చూడాలన్నారు.

విద్యార్థులకు అభినందనలు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన కింగ్‌షోటోకాన్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. తమ అకాడమీకి చెందిన మూడు గ్రాండ్ చాంపియన్‌షిప్‌లు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో మహ్మద్ అర్ష్ జమీల్ ఓపెన్ కటా విభాగంలో గ్రాండ్ చాంపియన్‌షిప్ రూ.10వేల నగదు, మహ్మద్ హంజేఫా షరీఫ్ బ్రౌన్–బ్లాక్‌బెల్టు వ్యక్తిగత కటాలో గ్రాండ్ చాంపియన్‌షిప్ రూ.5వేల నగదు, అండర్–12 ఏళ్ల వ్యక్తిగత కటాలో మహ్మద్ సాబేర్‌పాష గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించారన్నారు.

రాష్ట్రంలో ప్రజాపాలన

- ఓర్వలేకనే బీఆర్ఎస్, బీజేపీల విమర్శలు
- టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు నమ్మకంతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఏడాది పాలనపై ప్రజలు సంబరాలు చేసుకుంటుంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు విషాన్ని చిమ్ముతున్నాయని ఆరోపించారు. ఓర్వలేకనే ఈ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లాలో దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాలకు కూడా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమానికి పనిచేస్తుందన్నారు. సమావేశంలో డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, మాజీ కౌన్సిలర్ బాలస్వామి, నాయకుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనమివ్వాలి


జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : నవంబర్ నెలలో నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం ఇవ్వాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ శని, ఆదివారం తదితర సెలవు దినాల్లో పని చేసినందుకు ఇచ్చే కంపెన్సేటరీ సాధారణ సెలవులు వాడుకోవడానికి వీలుగా డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. దీనిపై సీఈఓ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని హామీఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమాకాంత్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూపతిసింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా కార్యదర్శి నర్సిములు, వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు


మహబూబ్‌నగర్‌లో సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్‌లు కట్ చేశారు. పలుచోట్ల రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. మహబూబ్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత కేక్ కట్ చేశారు. పాలమూరు యూనివర్సిటీలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడులకను ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పలుచోట్ల మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

కేక్‌లు కట్ చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


కేక్ కట్ చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు

కబ్జాకు గురైన శ్మశానవాటిక భూమి

- ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు

చిన్నచింతకుంట: మండలంలోని తిర్మలాపురం గ్రామంలో శ్మశాన వాటికకు సంబంధించిన భూమి కబ్జాకు గురైందని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ విజయేందిర బోయికి గ్రామస్తులు ఆనంద్, కాశ రవి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలో ఉన్న సర్వేనంబర్ 4లో గల 2ఎకరాల20 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఆరోపించారు. ఆ భూమిలో కొంత కాలంగా గ్రామస్తులు శవాలను పూడ్చుతూ వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో కొంతభాగం క్రీడా ప్రాంగణానికి కేటాయించారని తెలిపారు. ఆ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్నాడన్నారు. ఈభూమికి సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైన భూమిని విడిపించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సర్వే నంబర్ 4లో గల భూమికి సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైన భూమిని విడిపించాలని వారు కోరారు.

వినతులు నిల్

నవాబుపేట: ప్రజావాణికి ఎలాంటి వినతులు రాలేదని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులందరూ మధ్యాహ్నం వరకు వేచి ఉన్నారన్నారు. వరుసగా రెండో వారం ఫిర్యాదులు నిల్‌గా ఉండటం విశేషం. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, బద్రునాయక్ న్నారు.

ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

దేవరకద్ర: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి రెండు ఫిర్యాదు వచ్చాయి. వాటికి సంబంధించి త్వరలో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ రాజేందర్‌అగర్వాల్ పాల్గొన్నారు.